క్లుప్తంగా

నేడు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం

కూనవరం: మండలంలోని కాచవరంలో ఆదివారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈసమావేశానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

వేంకటేశ్వరునికి విశేష పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి వారు

అడ్డతీగల: స్థానిక అనిగేరు రోడ్డు వద్ద పార్వతీ సమేత నాగలింగేశ్వర క్షేత్రం సముదాయంలో గలశ్రీ దేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం నిర్వహించినట్టు ఆలయ కమిటీ కన్వీనర్ సామిదాల రాజారమేష్ తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపినట్టు ఆయన చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


మురుగునీటిని పరిశీలిస్తున్న ప్రసాద్

రాజవొమ్మంగి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని రాజవొమ్మంగి సబ్‌యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్ తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా సిబ్బందితో కలిసి మండలంలోని రాజవొమ్మంగి, లాగరాయి, జడ్డంగి పీహెచ్‌సీల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించారు. పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గృహాలకు వెళ్లి ఫీవర్ సర్వే, హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. వాడుక నీరు నిల్వలేకుండా చూడాలని సూచించారు. ఏంటి లార్వా ఆపరేషన్ పనులు చేపట్టారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత


మృతుడు దేవరాజు కుటుంబానికి బీమా సొమ్ము అందజేస్తున్న వైస్ ఎంపీపీ

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ సగండ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన దేవరాజు అనే గిరిజనుడి కుటుంబానికి శనివారం వైస్‌ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ మిల్కి వైఎస్సార్ బీమా సొమ్ము అందజేశారు. తక్షణ సాయం రూ.10 వేల నగదు అందించారు. మిగిలిన రూ.90 వేలు మృత్యుడి భార్య మాలతి బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుందని కుటుంబ సభ్యులకు వారు తెలిపారు.

కూర పనసకు భలే గిరాకీ


విరగ్గాసిన పనస

రాజవొమ్మంగి: ఏజెన్సీ ప్రాంతంలో లభిస్తున్న కూరపనసకు మైదాన ప్రాంతంలో మంచి గిరాకీ ఉంది. వీటిని వివిధ రకాల వంటకాలకు వినియోగిస్తారు. పనసకాయలు పక్వానికి రాకముందే లేతగా ఉన్నప్పుడే చెట్ల నుంచి కాయలను సేకరిస్తారు. కిలోలోపు బరువు ఉండే కాయలకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి భీమవరం, రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. గతంలో కిలో కాయ రూ.5 ఉండేది. ప్రస్తుతం రూ.15 వరకు ధర పలుకుతోంది. మండలంలో అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, లాగరాయి, లబ్బర్తి, లోదొడ్డి, పాకవెళ్లి ప్రాంతాల్లో రైతుల పొలాల వద్దకు వెళ్లి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

తొలగిన రహదారి కష్టాలు


వన్నడ నుంచి అరడగూడెం వరకు పూర్తయిన తారురోడ్డు

- వన్నడ-అరడగూడెం మధ్య పూర్తయిన తారురోడ్డు నిర్మాణం
- 9 పంచాయతీల్లో 130 గ్రామాలకు సౌకర్యం

పెదబయలు: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మారుమూల గ్రామాల్లో సైతం అద్దంలాంటి బీటీ రోడ్లు నిర్మిస్తోంది. అన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించడమే లక్ష్యంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కృషి చేస్తున్నారు. దీంతో దశాబ్దాల కాలంగా రోడ్డు సదుపాయానికి నోచుకోని ఆదివాసీ గ్రామాల ప్రజల కష్టాలు తొలగుతున్నాయి. వన్నడ, అరడగూడెం మధ్య ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో రూ.1.43 కోట్లతో 2.5 కిలో మీటర్ల మేర చేపట్టిన రోడ్డు పనులు పూర్తయ్యాయి. గోమంగి నుంచి వన్నడ గ్రామం వరకు తారు రోడ్డు ఉన్నప్పటికీ వన్నడ నుంచి అరడగూడెం వరకు ఘాట్ దారిలో తారురోడ్డు లేక ఆదివాసీలు నిత్యం అవస్థలు పడేవారు. ఆ రోడ్డు నిర్మించడంతో గోమంగి, గుల్లేలు,పోయిపల్లి,గిన్నెలకోట,లక్ష్మీపేట, ఇంజరి, బొండాపల్లి, లింగేటి, బొంగరం పంచాయతీల నుంచి 130 గ్రామాల ప్రజలకు జిల్లా కేంద్రం పాడేరు దగ్గరవుతుంది. పెదబయలు మండల కేంద్రానికి కూడా కొన్ని పంచాయతీల ప్రజలు తక్కువ సమయంలో చేరుకోవచ్చు. తారురోడ్డు పనులు పూర్తవడంతో గ్రామాలకు 108,104,తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, వైఎస్సార్ సంచార పశువైద్య వాహన సేవలు సకాలంలో అందుతున్నాయి. వన్నడ రోడ్డు నుంచి వంకరాయి,సంపెంగులబంద మీదుగా పంగలం వరకు రూ.1.95 కోట్లతో గోమంగి పంచాయతీలో తారురోడ్డు నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు పూర్తయితే గోమంగి పంచాయతీకి 95 శాతం తారురోడ్డు సదుపాయం కలుగుతుంది.

ఆనందంగా ఉంది



కిముడుపల్లి పంచాయతీ అరడగూడెం తారురోడ్డు నుంచి వన్నడ గ్రామం వరకు తారురోడ్డు నిర్మించడం ఆనందంగా ఉంది. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కృషి తోనే పూర్తయింది. గోమంగి పంచాయతీతో పాటుగా మరో 8 పంచాయతీల ప్రజలు జిల్లా కేంద్రం పాడేరుకు జిల్లా మండల కేంద్రానికి చేరుకోడానికి ఈ రోడ్డు అనుకూలంగా ఉంటుంది.

– కూడ మత్స్యకొండబాబు, ఉప సర్పంచ్, గోమంగి పంచాయతీ

విధులకు డుమ్మా కొడుతున్న ఉపాధ్యాయులు

- మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- మెమోలు జారీ చేస్తున్నామన్న ఎంఈవో


మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

కొయ్యూరు: నెలల తరబడి పాఠశాల ముఖం చూడని గురువులు ఎందరో మండలంలో ఉన్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. వేలకు వేలు జీతాలు తీసుకుంటూ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. యు.చీడిపాలెం ఎంపీటీసీ తమర్బ మాధవరావు మాట్లాడుతూ మర్రిపాకల పాఠశాలకు ఉపాధ్యాయులు రావడం లేదన్నారు.వారికి బదులుగా వేరేవారు వస్తున్నారని వివరించారు.దీనిపై చర్యలు తీసుకోకుంటే నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కొయ్యూరు పంచాయతీలో చింతవానిపాలెం ఉపాధ్యాయులు సరిగా పాఠశాలకు హాజరుకావడం లేదని ఎంపీటీసీ మల్లికార్జున్ తెలిపారు. ధర్మవరంలో కూడా ఉపాధ్యాయులు విధులకు డుమ్మాకొడుతున్నారని డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు తెలిపారు. ఎంఈవో బోడంనాయుడు స్పందిస్తూ విధులకు రాని వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.తదుపరి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ మిషన్ కనెక్ట్ పాడేరులో భాగంగా మారుమూల ప్రాంతాలకు రహదారులు వేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య,వైద్యానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఉద్యోగులు అంకిత బావంతో విధులు నిర్వహించాలని కోరారు. ఏవో కృష్ణవేణి మాట్లాడుతూ మండలంలో ఈకేవైసీ కానివారు ఇంకా 1365 మంది ఉన్నారని, వారికి కూడా పూర్తి చేయిస్తామన్నారు. పీఎం కిసాన్ నిధి నిధులు ఈకేవైసీ ఉన్నవారికే వస్తాయన్నారు.విద్యుత్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ 156 స్తంభాలు పాడైపోయాయని, ఇప్పటికి 120 స్తంభాలను మార్చామన్నారు. మిగిలిన వాటిని కూడా మారుస్తున్నట్టు చెప్పారు. బూదరాళ్ల, యు.చీడిపాలెం, ఎం.భీమవరం పంచాయతీల్లో 13 గ్రామాలకు రూ.5.25 కోట్లతో సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. జోగంపేట-మర్రిపాలెం మీదుగా బస్సును నడపాలని జెడ్పీటీసీ నూకరాజు, ఎంపీటీసీ బి.అప్పారావు ఆర్టీసీ అధికారులను కోరారు. ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, ఎంపీడీవో మేరీరోజ్, పర్యవేక్షకులు బాలకోటేశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి శంకుస్థాపన


తాగునీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి

చింతూరు: మండలంలోని వేగితోటలో నిర్మించనున్న తాగునీటి పథకానికి ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్పీటీసీ నిధులు రూ.10 లక్షలతో తాగునీటి ట్యాంకు నిర్మాణం, ఎంపీపీ నిధులు రూ.9 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. తాగునీటి సౌకర్యం లేని మారుమూల ప్రాంతాలకు నీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మండలంలోని మిట్టవాడలో కన్సర్వేటివ్ కండెవలప్‌మెంట్ ప్రోగ్రాం(సీసీడీపీ) నిధులు రూ.15 లక్షలతో జిన్నెలగుంపు వరకు నిర్మించనున్న 625 మీటర్ల గ్రావెల్ రహదారికి వారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, ఎంపీటీసీ సభ్యురాలు తుర్రం ముత్తమ్మ, సర్పంచ్ కారం కన్నారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, కోట్ల కృష్ణ పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబుకు సన్మానం


రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయ రూరల్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబును ఎమ్మెల్యే చెట్టిపాల్గుణ దుశ్శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేను రవిబాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కొండలరావు,యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్,ఎంపీపీ ఉషారాణి,మాజీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, మండల కన్వీనర్ పట్టాసీ సంపత్‌కుమార్, సర్పంచ్ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు

వై.రామవరం: అసాంఘిక శక్తులకు ఎవరూ సహకరించవద్దని సీఐ వై.రాంబాబు సూచించారు. పరివర్తన కార్యక్రమంలో భాగంగా జాజిగడ్డ గ్రామంలో శుక్రవారం రాత్రి సీఐ ఆధ్వర్యంలో ఆ గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వ్యాపారులకు సహకరించి జైలు పాలవద్దన్నారు. నాటుసారా తదితర మత్తు పదార్థాలు సేవించి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని సూచించారు. జూదం, కోడి పందాలు వంటి అసాంఘిక కార్యక్రమాల జోలికి పోయి ఇల్లు ను గుల్ల చేసుకోవద్దని తెలిపారు. గిరిజనాభి వృద్ధిలో పోలీసుశాఖ పాలుపంచుకుంటూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ కె.రాంబాబు, గ్రామ సచివాలయ మహిళాపోలీసు పాడియం దీప తదితరులు పాల్గొన్నారు.


గిరిజనుల హక్కులు కాలరాస్తే సహించం

- జేఏసీ జిల్లా కన్వీనర్ రామరావుదొర


సమావేశంలో మాట్లాడుతున్న రామరావు దొర

అరకులోయ రూరల్: అడ్డదారిలో కులధ్రువీకరణ పత్రాలు పొందేవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, గిరిజనుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని జేఏసీ జిల్లా కన్వీనర్ రామరావుదొర అన్నారు. స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైదాన ప్రాంతానికి చెందిన గిరిజనేతరుడు కర్రి ప్రభాకర్ (బీసీ) లోతేరు గ్రామం ఎస్టీ వాల్మీకి కులానికి చెందిన శెట్టి రత్నమణిని గతంలో కులాంతర వివాహం చేసుకున్నట్టు చెప్పారు. వారసత్వంగా తండ్రి కులమే వారికి పుట్టిన పిల్లలకు కూడా వర్తిస్తుందన్నారు. అయితే భార్య కులాన్ని అడ్డం పెట్టుకుని తన పిల్లలకు ప్రభాకర్ ఎస్టీ వాల్మీకి కులధ్రువీకరణ పత్రాలు పొందాడని తెలిపారు.ఈ విషయమై ప్రశ్నించినందుకు లోతేరు గ్రామానికి చెందిన శెట్టి వెంకటరావుపై కర్రి ప్రభాకర్ దౌర్జన్యం చేశాడని చెప్పారు. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేవరకూ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.నకిలీ ధ్రువీకరణ పత్రాల జారీపై నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో నిజమైన గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.దీనిపై అధికారులు విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సలహాదారుడు గంగరాజు, జేఏసీ నాయకులు నందో, మహాదేవ్,చట్టు మోహన్,నాగేశ్వరరావు, సింహాచలం,సాంబమూర్తి, శెట్టి అశోక్, వికాస్,కామేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


కనకం

కె.కోటపాడు: పిండ్రంగి గ్రామానికి చెందిన బత్తి కనకం(49) గతేడాది సెప్టెంబర్ 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతడి భార్య చిన్నమ్మలు ఫిర్యాదు చేసినట్టు ఏ కోడూరు ఎస్ఐ బి.రామకృష్ణ శనివారం తెలిపారు. అతడి ఆచూకీ కోసం ఆమెతోపాటు కుటుంబ సభ్యులు ఇతర గ్రామాల్లో వెతికారన్నారు. ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేతనదారులందరికీ పనులు కల్పించండి


తామరబ్బలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి

దేవరాపల్లి: జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో సీహెచ్. సుబ్బలక్ష్మి సంబంధిత సిబ్బందికి సూచించారు. తామరబ్బ పంచాయతీలో ఉపాధి హామీ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేస్తే తగిన గిట్టుబాటు కూలి లభిస్తుందన్నారు. వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలోనే పనులు చేసుకోవాలని సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈమె వెంట ఉపాధి ఏపీవో డి. చంద్రకళ, పంచాయతీ సెక్రటరీ ఎల్. లింగన్న, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఎనిమిది లక్షల పనిదినాలు కల్పించాలి

నాతవరం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో ఎన్ఆర్ఈజీఎస్ అదనపు ప్రాజెక్టు అధికారి ఎం.రోజారాణి సమీక్షించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.25 కోట్లతో బడ్జెట్ రూపొందించామన్నారు. మండలంలో 13 వేలకుపైగా జాబ్‌కార్డుదారులకు ఈ ఏడాది 8 లక్షల పని దినాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న 5 వేల మంది కూలీలను 7 వేలకు పెంచాలన్నారు.

విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


చింతపల్లిలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

చింతపల్లిరూరల్/అరకులోయరూరల్/జి.మాడుగుల/డుంబ్రిగుడ/హుకుంపేట/ముంచంగిపుట్టు/ పాడేరు రూరల్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎస్టీ కమిషన్ సభ్యుడు కుంభా రవిబాబు, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నర్సింగరావు కోరారు. సుధాకర్‌కు మద్దతుగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలే సుధాకర్ విజయానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలత,జీకేవీధి ఎంపీపీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ మండల కేంద్రంలో కంఠభంసుగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, గురుకుల కళాశాల, గురుకుల పాఠశాలల్లో శనివారం పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రచారం చేశారు. ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పట్టాసీ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగుల మండలంలో మండల ఎన్నికల పరిశీలకుడు వి.వి.రమణమూర్తి, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకట గంగరాజు(బుజ్జి), వైస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడులు వంతాల, సొలభం, గడుతూరు పంచాయతీల్లో ప్రచా రం చేశారు. లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, కన్వీనర్లు ఎల్ కళ్యాణం, చంద్రపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు చినమత్స్యకొండబాబు, మత్స్యకొండబాబు తదితరలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ మండలం సొవ్వ, గసభ పంచాయతీల్లో ఎంపీపీ బాక ఈశ్వరి,జెడ్పీటీసీ జానకమ్మ, వైస్ ఎంపీపీ లలిత, సర్పంచ్ రామూర్తి, గ్రామ సచివాలయ కన్వీనర్ గణపతి, పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు శాంతి,అరకు సర్పంచ్ శారద, మార్కెట్ డైరెక్టర్ బి.బి.సాద్రు, కిల్లో సునీల్, సొవ్వా పంచాయతీ కార్యదర్శి సద్దు ప్రచారం చేశారు.

హుకుంపేటలో నిర్వహించిన ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్, సర్పంచ్ రమేష్ తదితరులు ప్రచారం చేశారు.

పాడేరు మండలం మారుమూల కించూరు పంచాయతీలోని కించూరు, బంద్రోత్‌పుట్టు, ఉరుగొండ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పలాసి కోటేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ నగేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొట్టగుళ్లి కొండాజీ, పార్టీ మండల కార్యదర్శి కొట్టగుళ్లి నాగేంద్ర తదితరులు ప్రచారం నిర్వహించారు.

జంగమయ్య జాతర రేపు


డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమలో సోమవారం జంగమయ్య జాతర నిర్వహించనున్నట్టు సర్పంచ్ నాగేశ్వరరావు తెలిపారు. ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం పొడిగింపు


గజ్జయదొర

కొయ్యూరు: స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అప్పన గజ్జయ్య, సభ్యులు సన్యాసి దొర, వారా లక్ష్మి పదవీ కాలాన్ని ఈ ఏడాది జూలై చివర వరకూ పొడిగిస్తూ జిల్లా అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి పదవీ కాలాన్ని పొడిగించడం ఇదిమూడోసారి. ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయని పీఏసీఎస్ సీఈవో సత్యనారాయణ తెలిపారు.

చెట్టుపైనుంచి జారిపడి గిరిజనుడికి గాయాలు


గాయపడిన రామచంద్రరావు

గూడెంకొత్తవీధి: చెట్టుపైకి ఎక్కి మిరియాలు సేకరిస్తుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి గిరిజనుడు గాయపడిన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండలంలోని కొత్తపాకలు గ్రామానికి చెందిన వంతల రామచంద్రరావు అనే గిరిజనుడు సొంత కాఫీతోటలో చెట్టు ఎక్కి మిరియాలను సేకరిస్తుండగా కాలుజారి పడిపోయాడు. కుడిచేయి విరిగిపోయింది. అతనిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి కి తరలించారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయ 33వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 8వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని సదస్యం, పల్లకి సేవ, చక్రస్నానం, నాగవల్లి ఉత్సవాలు, పవళింపు సేవ నిర్వహించనున్నారు.

సీతంరాజు సుధాకర్ విజయానికి కృషి

అరకులోయ రూరల్: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అరకు నియోజకవర్గ పరిశీలకుడు సూడిపల్లి కొండలరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటినీ సందర్శించి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించాలని తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కరుణ కుమార్, ఎంపీపీ ఉషారాణి,వైస్ ఎంపీపీలు కిల్లో రామన్న,కొర్రా సుమంజాలి,మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రఘునాథ్,శెట్టి అప్పాలు,రంజిత్‌కుమార్,ముఖి సాంబ,యాసిన్,తిరుపతి,రాజారమేష్,సర్పంచ్‌లు సుస్మిత,భాస్కర్, సుంద్ర,గురు తదితరులు పాల్గొన్నారు.